ఏడాదైనా అందని సాయం

- గత సంవత్సరం వరదలకు వేలాది ఎకరాల్లో పంటనష్టం
- పరిహారంపై పట్టింపులేని అధికారులు
- మొక్కుబడిగా కేంద్ర బృందం పర్యటన



పంటనష్టాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం (ఫైల్)



గోదావరి వరదలకు పూర్తిగా దెబ్బతిన్న పత్తిచేను (ఫైల్)

బూర్గంపాడు: గత ఏడాది గోదావరి వరదలు రైతులను నట్టేట ముంచాయి. వానాకాలం సాగు చేసిన పంటలు గోదారి వరదలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరదలకు పంటలు దెబ్బతిన్న రైతులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వరదలు తగ్గిన తరువాత కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో హడావుడిగా పర్యటించింది. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి పంటనష్టం వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. కానీ వరదలు వచ్చి ఏడాది గడిచిన ఇంతవరకు పంటనష్టపోయిన రైతులకు రూపాయి సాయమందలేదు. మళ్లీ ఇప్పుడు వరదలు రైతులను కలవరపెడుతున్నాయి. గత ఏడాది జరిగిన నష్టం నుంచి తేరుకోకముందే ఇప్పుడు వరదలు రైతులను వణికిస్తున్నాయి. ఏడాది కాలంగా రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

గత ఏడాది గోదావరి వరదలకు జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 10,831 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. దీనివల్ల రైతులకు రూ.623.34 లక్షల మేర నష్టం జరిగింది. అయితే క్షేత్రస్థాయిలో పంటనష్టం ఇంకా ఎక్కువ జరిగిందని రైతులు చెబుతున్నారు. పత్తి పంటకు ఎకరాకు సుమారు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు నష్టం జరిగింది. పత్తి పంట ఏపుగా పెరిగే తరుణంలో గోదావరి వరదలు నిండా ముంచాయి. అదేవిధంగా వరినార్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. గత ఏడాది జూలై నెల 22వ తేదీన కేంద్ర బృందం బూర్గంపాడు మండలంలో క్షేత్రస్థాయిలో పంటనష్టాన్ని పరిశీలించింది. రైతులు తమకు జరిగిన నష్టాన్ని కేంద్ర బృందానికి వివరించారు. పంట నష్టానికి పరిహారం ఇస్తే తప్ప తిరిగి పంటలు సాగు చేయలేనటువంటి పరిస్థితులున్నాయని రైతులు తమగోడును కేంద్ర బృందానికి వినిపించారు. జిల్లాలో వరదల వలన జరిగిన నష్టాన్ని భద్రాచలం ఐటీడీఏలో జిల్లా కలెక్టర్ అనుదీప్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో కేంద్ర బృందానికి వివరించారు. గోదావరి వరదలకు కరెంట్ మోటార్లు, స్టార్టర్లు నీటమునిగి దెబ్బతిన్నాయి. పైపులు వరదలకు కొట్టుకుపోయాయి. రైతులు కొత్త మోటార్లు కొనుక్కునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. గత ఏడాది చాలామంది రైతులు పంటల సాగు కూడా మానేశారు. కేంద్ర బృందం పంటనష్టాన్ని పరిశీలించి ఏడాది కావస్తున్నప్పటికీ ఎలాంటి పరిహారమూ అందలేదు. గత ఏడాది వరదలకు నష్టపోయిన రైతులు ఈ ఏడాది ఇప్పటి వరకు పంటలు వేయటానికి వెనుకాడుతున్నారు.గత ఏడాది పంటనష్టాలతో ఈ ఏడాది పంట పెట్టుబడులకు కటకటగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం పంటనష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

రూ.లక్ష నష్టం జరిగింది

గత ఏడాది గోదావరి వరదలతో 8 ఎకరాల్లో పత్తి నీటమునిగి పూర్తిగా దెబ్బతింది. నాలుగురోజుల పాటు నీళ్లలో ఉండటంతో పత్తిమొక్కలు చనిపోయాయి. అప్పటికే ఎకరానికి రూ.13 వేల ఎకరాల వరకు నష్టం జరిగింది. మొత్తం రూ.లక్షకు పైగా నష్టం వచ్చింది.

– కొత్తా వెంకటరెడ్డి, రైతు

పట్టించుకోవడం లేదు

గత ఏడాది గోదావరి వరదలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. వరదలు వచ్చి ఏడాది దాటిన ప్రభుత్వం రూపాయి సాయమందించలేదు. కేంద్ర బృందం వచ్చి మొక్కుబడిగా పంటనష్టాన్ని చూసి వెళ్లింది. ఇప్పటి వరకు ఎలాంటి సాయమూ లేదు.

– బాసిబోయిన నాగరాజు, రైతు

ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు

గత ఏడాది గోదావరి వరదలతో జరిగిన పంటనష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. పంటనష్టానికి సంబంధించి పూర్తిస్థాయి వివరాలను ప్రభుత్వానికి అందించాం. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం.

– శంకర్, మండల వ్యవసాయశాఖ అధికారి

పాఠశాలలో మౌలిక సదుపాయాలు

భద్రాచలంటౌన్: ఐటీసీ ఎంఎస్‌కే, వావ్‌ల సంయుక్త సౌజన్యంతో సుమారు రూ.10 లక్షల వ్యయంతో భద్రాచలం పట్టణంలోని సుభాష్ నగర్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి మంగళవారం విద్యార్థులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఐటీసీ ఎంఎస్‌కే ప్రాజెక్ట్ మేనేజర్ జయప్రకాష్ మాట్లాడుతూ.. ఒక పాఠశాల నిర్మాణం 100 దేవాలయాల అభివృద్ధితో సమానం అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సమ్మయ్య, సీఐ నాగరాజు, హెచ్‌ఎం ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ జయప్రకాష్

రైతులు జాగ్రత్తలు పాటించాలి

చండ్రుగొండ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయశాఖ ఏడీఏ అఫ్జల్‌బేగం సూచించారు. మండలకేంద్రం చండ్రుగొండలోని ఎరువులు, పురుగు మందుల షాపులను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. విలేకరులతో మాట్లాడుతూ.. పత్తిపంటలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎరువులు, పురుగుమందులు స్ప్రే చేయొద్దని సూచించారు. వ్యవసాయ బోరుబావుల వద్ద నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, త్రీఫేస్ విద్యుత్‌తో జాగ్రత్తగా ఉండాలని రైతులను కోరారు.



ఎరువులు, పురుగుల మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ అఫ్జల్‌బేగం

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

బూర్గంపాడు: మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సాధిక్‌పాషా, బూర్గంపాడు పట్టణ అధ్యక్షుడు సొహైల్‌పాషా అన్నారు. మంగళవారం బూర్గంపాడులోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. మైనార్టీలకు షాదీ ముబారక్, రంజాన్ తోఫాలను అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. మైనార్టీల ఆర్థికాభివృద్ధి కోసం మైనార్టీని బంధును ముఖ్యమంత్రి ప్రకటించటం హర్షణీయమన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎంఏ సత్తార్, ఎండి.షహబాజ్, ఎస్‌కె.ఖయ్యూం, ఎండీ షౌకత్‌అలీ, ఎండి.అమీర్ పాషా, ఎస్‌కె.ఆసిఫ్ పాల్గొన్నారు.


విప్‌కు వినతి

మణుగూరురూరల్: డీఎస్సీ–2003 వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ మీరాహుస్సేన్, కారం సీతారామయ్యలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల గడువు ఆగస్టుతో ముగుస్తున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి డీఎస్సీ వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన రేగా.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మేరెడ్డి ఇంద్రసేనారెడ్డి, రత్నప్రసాద్, బి వెంకన్న, కుమారస్వామి పాల్గొన్నారు.

రహదారి ఏర్పాటు చేయాలి

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో ఇసుకవాగు వద్ద అశ్వాపురం–గొందిగూడెం మధ్య రాకపోకలకు తక్షణమే తాత్కాలిక రహదారి సౌకర్యం కల్పించాలని గొందిగూడెం సర్పంచ్ పాయం భద్రమ్మ కోరారు. మంగళవారం ఆమె గొందిగూడెంలో విలేకరులతో మాట్లాడారు. ఇసుక వాగుపై వంతెన నిర్మాణ పనులు జరుగుతుండటంతో వర్షాకాలం అని తెలిసి కూడా చప్టా, తాత్కాలిక రహదారిని తూతూమంత్రంగా నిర్మించడంతో భారీ వర్షానికి కొట్టుపోయిందన్నారు. వారం రోజులుగా రాకపోకలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్టర్, ఏఈకి విన్నవించినా స్పందించడం లేదని కలెక్టర్, అధికారులు స్పందించి తక్షణమే ఇసుకవాగు వద్ద తాత్కాలిక రహదారి ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.

వైభవంగా ముత్యాలమ్మ పండుగ



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో రెండేళ్లకోసారి నిర్వహించే జాతర ముగిసింది. మంగళవారం ముత్యాలమ్మ పండుగను పురస్కరించుకుని ఆలయం దగ్గర ఉదయం నుంచి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం సాయంత్రం సమయంలో దేవరబాలలు గ్రామ పురవీధుల గుండా మేళతాళాలలతో, డప్పు వాయిద్యాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ముత్యాలమ్మ చెట్టు దగ్గర మొక్కులు మొక్కారు. జాతరలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ గుడ్ల శ్రీనివాసరెడ్డి, శిరపు వీరరాఘవరెడ్డి, డల్లి హరిబాబు, గోసుల వెంకన్న, మద్ది రాము, గుడ్ల అప్పలరెడ్డి, తాతారావు తదితరులు పలు జాగ్రత్తలు తీసుకుని గ్రామ పండుగలు విజయవంతంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నారు.

ఎడతెరిపిలేని వర్షం

అన్నపురెడ్డిపల్లి: మండల వ్యాప్తింగా మంగళవారం ఎడతెరుపు లేకుండా మోస్తారు వర్షం కురిసింది. 20.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలలో నీరు చేరి జలకళను సంతరించుకున్నాయి. వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. రోజంతా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

కాంగ్రెస్ నియోజకవర్గ సమావేశం రద్దు

అశ్వాపురం: నేడు మణుగూరులో జరగవలసిన కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశం భారీ వర్షాల కారణంగా రద్దు చేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ముత్తినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరల సమావేశం తేదీని త్వరలో తెలియజేస్తామని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గమనించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ యూనియన్ సహాయ కార్యదర్శిగా శ్రీలత

అశ్వాపురం: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మండలంలోని ఎన్‌టీఆర్ కాలనీ అంగన్‌వాడీ టీచర్ కోరం శ్రీలత ఎన్నికయ్యారు. అలాగే, మల్లెలమడుగు అంగన్‌వాడీ టీచర్ రెడ్డి అరుణను రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు వేల్పుల మల్లికార్జున్, అనంతనేని సురేష్, కమటం వెంకటేశ్వరరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నాణ్యత లోపంపై ఫిర్యాదు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో నాణ్యత లోపంపై మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజ్ మంగళవారం ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు ఫిర్యాదు చేశారు. దళిత కుటుంబాల్లో జరిగే శుభకార్యల నిర్వహన కోసం నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో కాంట్రాక్టర్ ఇష్టారీతిగా వ్యవహరిస్తూ నాణ్యత లోపంతో నిర్మాణ పనులు చేపడుతున్నాడని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించి నాణ్యత లోపంతో నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

బెల్టు షాపులపై..

భద్రాచలంటౌన్: దుమ్ముగూడెం మండలంలో విచ్చల విడిగా ఏర్పాటు చేసిన బెల్టు షాపులపై భద్రాచలం ఎక్సైజ్ అధికారులకు సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా దుమ్ముగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం ఎక్సైజ్ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సాయన్న మాట్లాడుతూ.. మండలంలో గుడి, బడి తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో అనుమతులు లేకుండా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని, ఎక్సైజ్ అధికారులు వెంటనే వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల నాయకులు సున్నం వీరభద్రం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

మణుగూరురూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో రెండో దఫా ప్రవేశాల కోసం విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ బి.ప్రభాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023 విద్యాసంవత్సరానికిగానూ మణుగూరు ఐటీఐ కళాశాలల్లో ఫిట్టర్‌లో 14, ఎలక్ట్రిషియన్‌లో 30, డ్రాఫ్ట్‌మెన్ సివిల్‌లో 20, డీజిల్ మెకానికల్‌లో 45, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెన్స్ (కోపా)లలో 44 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆయా కోర్సుల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా సంబంధిత ధృవపత్రాలతో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కూడా ఆన్‌లైన్ దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎన్‌ఎఫ్‌ఏఈఈ అధ్యక్షుడిగా గడ్డం రమేష్

అశ్వాపురం: అణుశక్తి ఉద్యోగుల జాతీయ సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఏఈఈ) అధ్యక్షుడుగా మణుగూరు భారజల కర్మాగారం సైంటిఫిక్ అసిస్టెంట్స్ అండ్ సూపర్‌వైజర్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గడ్డం రమేష్ ఎన్నికయ్యారు. సోమవారం రాత్రి ముంబైలో జరిగిన సంఘం అధ్యక్ష ఎన్నికల్లో సమీప అభ్యర్థిపై రమేష్ గెలుపొందారు. ప్రస్తుతం జాతీయ కార్మిక సంఘాల సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గడ్డం రమేష్ వ్యవహరిస్తున్నారు. ఎన్‌ఎఫ్‌ఏఈఈ అధ్యక్షుడుగా ఎన్నికైన రమేష్‌ను ముంబైలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాడ్య కేశవరావు, ఉపాధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, సైంటిఫిక్ అసిస్టెంట్స్ అండ్ సూపర్‌వైజర్ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రాజు, సీనియర్ నాయకుడు శ్రీనివాసరావు, జాతీయ సమాఖ్య నాయకులు అభినందించారు.

పాఠశాల ప్రాంగణంలో వరదతో ఇక్కట్లు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని మట్టితో ఎత్తు పెంచాలని సీపీఎం మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. వర్షపునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధులు సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, ఆర్.వెంకటాచారి, పోట్రు వీరభద్రం, స్థానికులు కడియాల వెంకటేశ్వర్లు, జి.సత్యం, నజీర్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల భిక్షాటన

అశ్వారావుపేటరూరల్: తమ డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికులు భిక్షాటన చేశారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని దుకాణాలకు వెళ్లి భిక్షాటన చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రామదండు సంఘం ఆధ్వర్యంలో జీపీ కార్మికులకు భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎం.కామేష్, మూల అప్పన్న, కేసుపాక నరసింహారావు, భవాని, నందు, నాగేంద్రరావు పాల్గొన్నారు.

కార్మికులకు అన్నదానం

గుండాల: 20 రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు మండల కేంద్రంలోని అమ్మ హోటల్ యజమాని గామాలపాటి లక్ష్మీనారాయణ మంగళవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు గోడపత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా మండల కార్యదర్శి సాయన్న మాట్లాడుతూ.. ఆగస్టు 4వ తేదీన హైదరాబాదులో జరిగే కార్మిక గర్జన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ ఆటో యూనియన్ నాయకులు నారాయణ, ప్రగతిశీల రైతు సంఘం భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు సున్న వీరభద్రం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చర్చలకు పిలవాలి

ములకలపల్లి: గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె పరిష్కారానికి పాలకపక్షాలు చొరవచూపాలని, ప్రతినిధి బృందాలను చర్చలకు పిలిచి, డిమాండ్లు పరిష్కరించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా చైర్మన్ ఏజే. రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా మాట్లాడారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవికుమార్, మండల కన్వీనర్ నిమ్మల మధు. వర్కర్స్ యూనియన్ నాయకులు సాయిరత్న, అవుటూరి రాంబాబు, గంటా శ్రీను, చిక్కుల శ్రీను, వర్కా రుక్మాంగధరరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అన్నపురెడ్డిపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక కోరారు. మంగళవారం మండల పరిధిలోని తొట్టిపంపు గ్రామంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె పాల్గొన్నారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ర్యాపిడ్ ఫీవర్ సర్వేను పరిశీలించారు. వర్షాలు కురుస్తుండడంతో కలుషిత నీరు తాగవద్దని, నీటిని వేడి చేసుకుని తాగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ నాగేశ్వరరావు, ఏఎన్ఎం నాగజ్యోతి, ఆశాలు, వైద్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని సున్నంబట్టి, పెదవాగు ప్రాజెక్టు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వినాయకపురం పీహెచ్‌సీ వైద్యులు రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో మొత్తం 58 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. పరిసరాలను పరిశీలించి శుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులకు వేడిగా ఉండే ఆహారాన్ని అందించాలని, వ్యక్తిగత శుభ్రత పాటించేలా చూడాలని ఆశ్రమ సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్‌ఈఓ రాజు, సూపర్ వైజర్ శ్రీనివాస్, ఎంటీఎస్ విజయరెడ్డి, ఏఎన్ఎం చెల్లమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మణుగూరురూరల్: విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరురూరల్: మండలంలోని ఎంజేపీటీబీసీ బాలుర గురుకుల పాఠశాలలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యాధికారి శివకుమార్ విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం అశోక్‌నగర్, అదర్శనగర్‌లలో నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాన్ని సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ అనీష, సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, వైద్యసిబ్బంది జానకి, రాంప్రసాద్, సుమ, విజయ, అరుణ, నాగజ్యోతి, ఆశావర్కర్లు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

బూర్గంపాడు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హనమంతరావును జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలసి గ్రామాల్లోని రోడ్లు, డ్రెయినేజీ తదితర అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామాలలో అవసరమైన రోడ్లు, డ్రెయినేజీలకు సంబంధించిన ప్రతిపాదనలు అందజేశారు. దీనిపై పంచాయతీరాజ్ కమిషనర్ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుకు సహకరిస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కామిరెడ్డి రామకొండారెడ్డి పాల్గొన్నారు.



రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు ప్రతిపాదనలు అందజేస్తున్న జెడ్పీటీసీ శ్రీలత

వీఆర్‌ఏల సంబురాలు



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

చర్ల: రాష్ట్రంలో వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించి రెగ్యులర్ చేయడంపై బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తోటమళ్ల వరప్రసాద్ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల కమిటీ సమావేశమై వీఆర్‌ఏలను సూపర్ న్యూమరీ పోస్టులలో భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడారు. సమావేశంలో పలువురు ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

దుమ్ముగూడెం: తమను రెగ్యులర్ చేయడానికి కృతజ్ఞతగా స్థానిక వీఆర్‌ఏలు మంగళవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు గణేష్, రాజేష్, లక్ష్మీ, వెంకటలక్ష్మి, సీతారాములు, చంటి, వీర్రాజు, నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు యండి.జానీపాషా, దామెర్లశ్రీను, మోత్కూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

ములకలపల్లి: విరివిగా మొక్కలునాటి, వాటి సంరక్షణకు పాటుపడాలని లయన్స్ క్లబ్ పాల్వంచ, కిన్నెర అధ్యక్షుడు కేథారేశ్వరరావు పిలుపునిచ్చారు. క్లబ్ ఆధ్వర్యంలో మండలపరిధిలోని కమలాపురం ఆశ్రమ పాఠశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పర్యావరణ పరిరక్షకు ప్రతీఒక్కరు కృషి చేయాలని అన్నారు. క్లబ్ సెక్రటరీ ప్రసాదరావు, హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు, ట్రెజరర్ ఎండి.రంబాన్, క్లబ్ సభ్యులు ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి

మణిపూర్‌లోని హింసాకాండపై నిరసన జ్వాలలు ఆరడం లేదు. నియోజకవర్గాల్లో పలు ప్రాంతాల్లో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐతోపాటు ఇతర పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం నిరసనలు వ్యక్తం చేశారు. ర్యాలీలు, ధర్నాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మణిపూర్‌లోని మారణకాండకు కేంద్ర ప్రభుత్వ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అండతోనే దాడులు జరుగుతున్నట్లు వామపక్ష నాయకులు విమర్శించారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు



గుండాల: జగ్గాయిగూడెంలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



దుమ్ముగూడెం: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



మణుగూరురూరల్: తహసీల్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు



అశ్వారావుపేటరూరల్: నిరసన ర్యాలీ అనంతరం మాట్లాడుతున్న సీపీఐ నాయకులు